# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రపతి భవన్‌లో రేపు ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.**

**2.** **టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.**

**3.** **తెలంగాణలోని వరంగల్- ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు.**

**4.** **ఈ రోజు సముద్ర పరిరక్షణా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

**5.** **రుతుపవనాల ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది.**

==========================

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ రేపు ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో రేపు సాయంత్రం ప్రమాణ స్వీకారం జరగనుంది. నరేంద్ర మోదీతో పాటు, నూతన మంత్రివర్గంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీంతో వరసగా మూడవసారి ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

కాగా ఢిల్లీలో నిన్న జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో జాతీయ ప్రజా స్వామ్య కూటమి ఎన్డీఏ పక్ష నేతగా నరేంద్ర మోదీని కూటమి పార్టీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయని బీజేపీ నాయకులు ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవన్లో నిన్న జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ఎన్డీఏ కూటమి పక్షాలు హాజరయ్యాయి. నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్డీఏ పక్షనేతగా మోదీ పేరును బీజేపీ నాయకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు. జనసేన అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ తదితర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నాయకులు బలపరిచారు.

ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నరేంద్ర మోదీని దార్శనీకునిగా అభివర్ణించారు. మోదీ నేతృత్వంలోని భారతదేశం గత పదేళ్లలో ఎంతగానో అభివృద్ధి చెందిందని .. ఆయన నేతృత్వంలోనే భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందని ప్రశంసించారు.

ఎన్డీఏ కూటమి అధ్యక్షులుగా ఎన్నికైన అనంతరం నరేంద్రమోదీ మాట్లాడుతూ... కేంద్రంలో మరోసారి

కొలువుదీరబోతున్న ఎన్డీయే ప్రభుత్వం అన్ని నిర్ణయాలనూ సమష్టిగా తీసుకుంటుందని ఉద్ఘాటించారు.

---------------------------

తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రమాణ స్వీకారోత్సవంతో పాటు విజయోత్సవ సభ కూడా నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కూటమి నేతలు హాజరు కానున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి. సభ నిర్వహణ కోసం గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్, మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో బ్రహ్మానందపురం భూములను అధికారులు, పరిశీలిస్తున్నారని టీడీపీ నాయకులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం- సీఎంవోలో పనిచేస్తున్న పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాలను రాష్ట్ర ప్రభుత్వం నిన్న బదిలీ చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారిణి పూనం మాలకొండయ్య ప్రస్తుతం సీఎంవోలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. రేవు ముత్యాలరాజు సీఎంవోలో కార్యదర్శి హోదాలో ఉండగా, నారాయణ భరత్ గుప్తా అదనపు కార్యదర్శిగా ఉన్నారు. ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులు సాధారణ పరిపాలన శాఖకి రిపోర్టు చేయాలని నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

తెలంగాణలోని వరంగల్- ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నగా పిలిచే చింత పండు నవీన్ కుమార్ విజయం సాధించారు. ఎలిమినేషన్ ప్రక్రియలో భాగంగా బిజెపి అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డికి వచ్చిన రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం.. భారత రాష్ట్ర సమితి మద్దతిచ్చిన రాకేశ్ రెడ్డి కంటే తీన్మార్ మల్లన్న 14 వేలకు పైగా ఓట్లతో ముందంజలో ఉండటంతో ఆయన గెలుపొందారు. గత అర్థరాత్రి దాటాక రిటర్నింగ్ అధికారి తీన్మార్ మల్లన్నకు గెలుపు ధ్రువీకరణ పత్రం అందించారు. మెజార్టీ పూర్తి వివరాలు ఈ రోజు తెలియజేస్తామని అధికారులు తెలిపారు

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన నిన్న షెడ్యూల్ విడుదల చేశారు. ఈ రోజు నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలు కానుంది. తెలంగాణలోని మల్టీ జోన్-1లో ఈ రోజు నుంచి ఈ నెల 22వ తేదీ వరకు 15 రోజుల పాటు, మల్టీ జోన్-2లో ఈ రోజు నుంచి 30వ తేదీ వరకు 23 రోజులు ఈ ప్రక్రియ జరగనుందని అధికారులు తెలిపారు. మల్టీ జోన్-2 పరిధిలోని రంగారెడ్డి జిల్లాలో కోర్టు కేసులున్నందున మల్టీ జోన్ స్థాయిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు మాత్రమే పూర్తి చేయనున్నామని చెప్పారు .

---------------------------

తెలంగాణలో రేపు జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు నాలుగు లక్షల మూడు వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారని

పేర్కొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతో పాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు చెప్పారు. రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి ఒంటి గంట వరకు గ్రూప్-1 ప్రిలిమ్స్ జరుగుతుందని, గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని టీజీపీఎస్సీ అధికారులు సూచించారు.

---------------------------

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈ రోజు జరిగే చేప మందు ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని తెలంగాణ మత్స్యశాఖ కార్పొరేషన్ ఛైర్మెన్ ఎం. సాయి కుమార్ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ, ప్రతియేటా మృగశిర కార్తె సందర్భంగా ఉబ్బసం రోగులకు బత్తిన సోదరులు చేప మందును పంపిణీ చేస్తున్నారని, చేప మందు కార్యక్రమాన్ని తెలంగాణ శాసన సభాపతి ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు ప్రారంభిస్తారని తెలిపారు. చేప మందు పంపిణీ కోసం తెలంగాణ మత్స్యశాఖ 1లక్ష 60వేల చేప పిల్లలను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

---------------------------

“మన సముద్రాల్లో సురక్షిత వాతావరణం కోసం చర్యలు” అన్న ఇతివృత్తంతో ఈ రోజు సముద్ర పరిరక్షణా దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూ వాతావరణం... సమతుల్య స్థితిలో ఉండేందుకు సముద్రాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. సముద్రాలు లేని పక్షంలో మానవుని మనుగడ దుర్భరమవుతుంది. అన్నిటికంటే ముఖ్యమైనది వర్షాలు, రుతుపవనాల ఆగమనం సముద్రాల వల్లనే సాఫీగా జరుగుతుంది. తుపానులు, గాలుల రాకలో సముద్రాలే కీలక భూమిక పోషిస్తాయి. అంతేకాదు.. లక్షలాది జీవ రాశులకు సముద్రాలు నిలయంగా వున్నాయి. ఈ జీవరాశు లు కూడా పర్యావరణ సమతుల్యానికి దోహదం చేస్తున్నాయి. ఇంత ప్రాముఖ్యం వున్న సముద్రాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ఈరోజు సముద్ర పరిరక్షణా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

రాయలసీమపై ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తున్నాయని వచ్చే రెండు మూడు రోజుల్లో ఇవి కోస్తాంధ్రలోని మిగిలిన భాగాలు, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాల్లో మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులు వానలు కొనసాగనున్నాయని పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అలాగే రానున్న 48 గంటల్లో తెలంగాణాలోని ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం వుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం వుందని వెల్లడించింది.

---------------------------

కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బ తిన్న పిల్లర్ల మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని  తెలంగాణ రాష్ట్ర జలవనరుల శాఖా  మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్మాణ సంస్థలను ఆదేశించారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను నిపుణుల బృందంతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ  డ్యామ్ భద్రతా సంస్థ  నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసిందని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం వద్ద  మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.  వర్షాలకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని నిర్మాణ సంస్థలను ఆదేశించామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి  తెలిపారు.

======================